క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

పిట్టలవానిపాలెం: కొత్తపాలెం గ్రామంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందోలు బండ్లమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ దోమ నాగేశ్వరరెడ్డి విద్యుద్దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు. కనక తప్పెట్లు, బ్యాండు మేళాలతో ఉత్సవం ఘనంగా జరిగింది.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు



బాపట్లటౌన్: మూడు నెలలుగా తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పూండ్ల గ్రామానికి చెందిన మెట్ల రేవతి తన భర్త రాము ఫైర్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహించేవారని, ఈ ఏడాది ఏప్రిల్ 14న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లారని తెలిపింది. అప్పటి నుంచి తిరిగిరాలేదని, తన భర్త ద్విచక్ర వాహనం జమ్ములపాలెం గ్రామంలోని తన మామ ఇంటివద్ద ఉందని తెలుసుకొని అప్పటి నుంచి ఊరూరా గాలిస్తూనే ఉన్నట్లు పేర్కొంది. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రేవతి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బార్ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: మద్యం తాగి బార్‌లో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేసిన యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన చింతా మణికుమార్ మరో ఇద్దరు స్నేహితులతో కలసి తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రముఖ బార్‌కు గురువారం రాత్రి వచ్చాడు. రాత్రి పొద్దుపోయాక మిగిలిన ఇద్దరు మద్యం తాగి వెళ్లిపోగా, మణికుమార్ జారుకునే ప్రయత్నం చేశాడు. పసిగట్టిన బార్ సిబ్బంది అతన్ని అటకాయించడంతో వారిపై దాడి చేసి గాయపర్చాడు. బార్ నిర్వాహకులు, సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన మాజీ జవాను నలుకుర్తి రవి ఆధ్వర్యంలో గ్రామ ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు జామెంట్రీ బాక్సులను శుకవారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సుద్దపల్లి నాగరాజు, అత్తోట శరత్, న్యాయవాదులు, ఇందుపల్లి రాజారాం, సుద్దపల్లి మురళి, మందా జనార్థనరావు, సోమశేఖరరావు, కుమార్, ఏసోబు తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తాడికొండ: అప్పుల బాధతో పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ మండలం పాములపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామానికి చెందిన కొల్లూరు అశోక్(48) రైతు. కొన్ని సంవత్సరాలుగా సాగులో వరుస నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

నువ్వక్కడుండీ.. నేనిక్కడుంటే..!

ఉరిమే మేఘాలు ఒళ్లు జలదరింపజేస్తాయి. మెరిసే మెరుపులు భయకంపితులను చేస్తాయి. ఉరుమూ మెరుపు కలయికలో కురిసే చినుకులు మాత్రం మేనుకు కొత్త హాయినిస్తాయి. తోడుగా నిలవాల్సిన సహచరి కాస్త.. సాన్నిహిత్యం ఉంటే ఆ హాయి ఆనందాన్నిస్తుంది. కొత్త దంపతులకు ఈ రకమైన పరిసరాలు ఉత్తేజాన్నిస్తాయి. కానీ ఏం లాభం..! చూసుకోవడానికి కూడా వీలు లేకుండా కఠిన నిబంధనలు.. కలుసుకుంటే కలిగే విపరిణామాల గురించి ఎన్నో అనుమానాలు.. నిజంకాకపోయి ఉంటే బాగుండేదన్న తలంపులు.. పదే పదే గుర్తొచ్చే భాగస్వామికి దగ్గరయ్యేందుకు కుదరదంటే కుదరదంతే అనే పెద్ద వాళ్ల ఆంక్షలు.. కాంక్షలున్న చోట ఆంక్షలు ఎలా నిలుస్తాయనే కుర్రకారు ఆలోచనలు.. వెరశి ఆషాఢ మాసం నవ దంపతులకు ఎడబాటు తప్పదు. ఈ నేపథ్యంలో నూతన జంటను ఆషాఢంలో విడిగా ఎందుకు ఉంచాలో, దాని వెనుక ఉన్న శాస్త్రీయతేంటో తెలుసుకోవాలి.

- అక్కడమ్మాయి.. ఇక్కడబ్బాయి
- నవ దాంపత్యంలో ఆషాఢ విరామం
- బంధం బలోపేతానికి మూలం
- ఆచార, సాంప్రదాయాల వెనుక శాస్త్రీయత
- ఎడబాటూ మంచిదే అంటున్న పెద్దలు
- పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై దూర దృష్టి
- వ్యవసాయాధారిత భారతంలో ఈ మాసానికి ప్రత్యేకత





నెహ్రూనగర్ : ఆషాఢ మాసం ఏడబాటు పెళ్లయిన కొత్త జంట మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే.. ఆ దంపతుల మధ్య అనురాగాన్ని చిగురింపజేస్తుంది. గతంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసి.. అచారాలు, వ్యవహారాలు, సంప్రదాయాలు అన్నీ నిర్ధారించిన వివాహాల్లో దంపతుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు అంతగా ప్రాధాన్యత లేకుండేది. ఈ ఆషాఢ మాసం ఎడబాటు కారణంగా వ్యక్తిగత అభిరుచులు, అభిప్రాయాలు మరింత బలపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఎడబాటు ఎందుకంటే....

కొత్త కోడలు తన అత్తను చూడకూడదు. అల్లుడు అత్తవారింటి గడప దాటకూడదు అనే నిబంధనలు మానవ సమాజంలో తరుచూ వినిపించేవే. కోడలు, అత్త ఒకరినొకరు చూసుకోవడం వల్ల వచ్చే సమస్యలు ఏమీలేవు. అయితే దీని వెనుక శాస్త్రీయత, సంప్రదాయం దాగి ఉంది. ప్రధానంగా మన దేశం వ్యవసాయంపైన ఆధారపడి ఉండదని అందరికి తెలిసిందే... మృగ శిరకార్తె నుంచి ప్రారంభమైన తొలకరి చినుకుల రాక.. క్రమంగా ఆషాఢ మాసంలో అడుగుపెట్టే సరికి పూర్తి వర్షకాలంగా మారిపోతుంది. సాగు ప్రధాన వృత్తిగా ఉన్న కుటుంబాల్లో ఇంటిల్లిపాదీ వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతారు. చినుకుల రాక కోసం ఎదిరు చూస్తూ నల్లటి మేఘాలపై కొండంత ఆశతో దుక్కులు దున్నడం, నాట్లు వేయడం వంటి పనులు మొదలు పెడతారు. ఈ క్రమంలో పిల్లలు బడులకు వెళిపోతే.. పెద్దవాళ్ళంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. కాబట్టి కొత్త అల్లుడికి చేయాల్సిన మర్యాదలు చేయలేకపోతారు. కర్మభూమిగా కీర్తి గాంచిన దేశంలో చేసే వృత్తిని కాదని మిగిలినవేవి చేయాలనుకోరు. అందుకే ఈ నెలలో కొత్త అల్లుడు ఇంటికి రాకుండా ఉంటే సాగు పనులు నిరాటంకంగా సాగిపోతాయనే ఉద్దేశంతో ఈ నియమం విధించారు. వ్యవసాయాధారిత కుటుంబాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. కాబట్టి అందరూ ఈ నియమాన్ని నేటికీ అనుసరిస్తున్నారు.

ప్రత్యామ్నాయాలు బోలెడు...

ఎడబాటు కొత్త జంటకు కొంత ఇబ్బంది కలిగించినప్పటికీ ప్రస్తుత ఆధునిక కాలంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలు ఎడబాటు భావనను దూరం చేస్తున్నాయి. సెల్‌ఫోన్ వచ్చాక మనుషుల మధ్య మానసికంగా దూరం చాలా వరకు తగ్గిపోయింది. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పర సందేశాలు ఎలాగూ మార్చుకునే సౌకర్యం ఉండనే ఉంది. తమ విరహాగ్ని చల్లార్చుకునే పలు రకాల ప్రత్యామ్నాయాలకు కొదవేం లేదు. అభిప్రాయాలు, స్వీట్ థింగ్స్ షేర్ చేసుకుంటూ కాలాన్ని సులువుగా గడిపేయొచ్చు.

శాస్త్రీయ కోణంలోనూ మంచిదే...

నవ దంపతులు ఆషాఢ మాసంలో విడిగా ఉండాలనే నియమం ఏనాటి నుంచో వస్తోంది. పూర్వం రోజుల్లో కొత్తగా పెళ్లయిన యువకులు ఆరు నెలల పాటు అత్తవారింట్లో కూర్చుని ఉండే సంప్రదాయం ఉండేది. శ్రమించే సమయంలో సమయంలో ఆరు నెలలు పాటు అత్తవారింట్లో కూర్చుని ఉంటే జరగాల్సిన పనులు స్తంభించిపోతాయి. నవ దంపతులు ఒకే గూటిలో ఉండడం అంత మంచిది కాదని ఎందుకంటారంటే....ఈ సమయంలో ఒక వేళ గర్భధారణ జరగడం తల్లి, బిడ్డకు అంత క్షేమకరం కాదు. ఇప్పుడు గర్భధారణ జరిగితే ప్రసవ సమయం వచ్చే ఎండకాలంలో ఉంటుంది. తీవ్ర ఉష్ణోగ్రతలు, వడగాలలు వీచే వేసవి సమయంలో జన్మించే శిశువు బాహ్య పరిసరాలు, ఉష్ణోగ్రతను భరించే స్థితిలో ఉండకపోవచ్చు. కాబటి ఈ ఒక్క ఆషాఢ మాసంలో దంపతులు వియోగం పాటిస్తే సంతానోత్పత్తి సమయాన్ని జూన్, జూలై వరకు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతల కారణంగా సుఖ ప్రసవానికి అనుకూలంగా ఉంటుంది. శిశువు సైతం తన నూతన పరిసరాలను సులువుగా అలవాటు పడతారు. ఈ శాస్త్రీయ నేపథ్యంలో కొత్త జంటకు ఎడబాటును అనివార్యమని పెద్దలు నిర్ణయించారు. అదే విధానాన్ని నేటికీ అన్ని కుటుంబాల్లో అచరిస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలి

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సులభతరమవుతుందని మండల విద్యాశాఖ అధికారి కేసనశెట్టి సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని మోంట్ ఫోర్ట్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్కూల్ క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆట పాటలు, సాంస్కృతిక, సేవా రంగాల్లోనూ సత్తా చాటాలన్నారు. క్రీడా రంగంలో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక, సేవా రంగాల్లో ఎన్నికైన స్కూల్ నూతన క్యాబినెట్ విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.



నూతన క్యాబినెట్ విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సురేష్

అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్ ఫాస్ట్, క్రీడా విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు

రేపల్లె రూరల్: గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య, దోమల నివారణ కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. గృహ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను పడవేయకుండా నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని చెప్పారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గృహంలో తేమ వాతావరణం లేకుండా చూడటంతో పాటు వారంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలు అవలంభించాల్సిన ఆరోగ్య నియమాలను వివరించాలన్నారు. జ్వరం, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం పర్యటిస్తూ ఎక్కడా మురుగు, చెత్తాచెదారం నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది మురుగు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్, దోమల నివారణ మందును వినియోగించే విధానంపై నివాసితులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మోర్లగుంట గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారి చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఉదారతను చాటుకున్న బాల్య స్నేహితులు

భట్టిప్రోలు: బాల్య స్నేహితులు తమ ఉదారతను చాటుకున్నారు. అందరూ కలసి కట్టుగా ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలవాలనుకున్న నిర్ణయాన్ని ఆచరణలో పాటించారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ 1987–1988 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మైత్రి విద్యా సేవా సమితిని ఏర్పాటు చేసుకుని, తమ స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు కృషి చేస్తున్నారు. కష్టంలో ఉన్న తోటి స్నేహితురాలు గాలంకి విజయవర్ధిని కుమార్తె విక్టోరియా ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం రూ. 36 వేలు అందించారు. ఈ చెక్కును శుక్రవారం స్థానిక బౌద్ధ స్తూపం వద్ద విశ్రాంత తెలుగు పండిట్ ముద్దా లీలామోహన్‌రావు చేతుల మీదగా పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉషారమణి, పీవీ రమణారావు, శ్రీనివాసు, దేవాజీ, రమణ, ఆంజనేయులు, విజయసారథి, సురేంద్ర, సుబ్బారావు, కరిముల్లా, సాయి, ఎ.సుబ్బారావు, షర్ఫుద్దీన్, టి.గంగాధర్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని చదువుకు నగదు అందజేస్తున్న లీలా మోహన్‌రావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో రేపల్లె పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ నుంచి రింగ్ రోడ్డు వరకు రోడ్డుకు ఉత్తరం వైపు, రింగ్ రోడ్డు నుంచి జెండా చెట్టు, పోస్టాఫీస్ ఏరియా, దర్గా రోడ్డు, యూనియన్ బ్యాంకు రోడ్డు, నేతాజీ నగర్, పేటేరు రోడ్డు, ప్రభుత్వ ఆఫీసుల ప్రాంగణం, షాదీ ఖానా ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

చెరుకుపల్లి: చెరుకుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ అజహర్ బాషా శుక్రవారం తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతుల దృష్ట్యా అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పి. ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేమవరం, సూరేపల్లి, తాతావారిపాలెం, కోనేటిపురం, జంపనివారిపాలెం, పడమటిపాలెం, పల్లెకోన, రామూరు, ఆళ్లమూడి, ఐలవరం, భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో విద్యుత్ లేన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాపట్లటౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాపట్ల మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ యల్లావుల కోటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

బాపట్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా స్టేట్ బ్యాంకు ముందుకు పోతుందని ఆ బ్యాంకు బ్రాంచి మేనేజర్ వర్ల ఆనందబాబు పేర్కొన్నారు. బాపట్ల స్టేట్ బ్యాంకులో వినియోగదారుల సాధికారత సమావేశం శుక్రవారం ఉదయం జరిగింది. ఈ సమావేశంలో బ్రాంచి మేనేజర్ వర్ల ఆనందబాబు మాట్లాడుతూ యోనో యాప్ ద్వారా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. ఖాతాదారులకు రుణాలు ఇవ్వటం.. రుణాలను ఏవిధంగా చెల్లించాలో తగిన సూచనలు అందించారు. ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ పూనూరి అనిల్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. వ్యవసాయ రుణాలు తక్షణమే ఇస్తామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు అధికారులు జె.శ్రీనివాస్, వి.శ్రీను, ఏసయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ ఆనందబాబు

దుకాణం తొలగించాలంటూ స్థానికులు ఆందోళన

- కోర్టు స్టే తెచ్చుకున్న దుకాణదారుడు
- తాళం వేసి శాంతిపజేసిన మున్సిపల్, పోలీసు అధికారులు

తెనాలిఅర్బన్: మున్సిపల్ స్థలంలో ఉన్న దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు శుక్రవారం ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న మున్సిపల్, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని షాపును తాత్కాలికంగా మూసివేయించి ఆందోళన విరమింపజేశారు. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం నందులపేట ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో అంచ నరేంద్రకుమార్ సమీపంలోని మున్సిపల్ స్థలంలో శ్రీహరి జనరల్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ ఏర్పాటు చేసుకున్నానని వ్యాపారం నిర్వహిస్తున్నారు. స్థానికులతో అతనికి విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు శుక్రవారం షాపు ముందు ధర్నా చేశారు. అలాగే షాపులోని వస్తువులు కొన్నింటిని పగులకొట్టారు. వెంటనే షాపు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అసిస్టెంట్ సీటీ ప్లానర్‌లు జడ్.సుధాకర్, సుబ్బారావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అలాగే వన్ టౌన్, టు టౌన్ సీఐలతో పాటు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. షాపును తొలగించవద్దు అంటూ కోర్టునుంచి స్టే అర్డర్ ఉండటం వలన దానిని తొలగించలేకపోయమని మున్సిపల్ అధికారులు పోలీసులకు తెలియజేశారు. ఈ నెల 25న వాయిదా ఉందని, ఆ సమయంలో న్యాయమూర్తి ఇచ్చే తీర్పు ఆధారంగా నడుచుకుంటామని చెప్పారు. దీనికి శాంతించని ఓ మహిళ పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించింది. దీనిని గమనించిన పోలీసులు బాటిల్‌ను లాక్కుని పారపోశారు. అనంతరం స్థానికుల కోరిక మేరకు షాపుకు తాళాలు వేశారు. తాము చెప్పే వరకు తాళాలు తీయవద్దని షాపు నిర్వాహకుడికి సూచించారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.



షాపు ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

సేంద్రియంపై రైతులు దృష్టి సారించాలి

పిట్టలవానిపాలెం: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు పేర్కొన్నారు. శుక్రవారం పిట్టలవానిపాలెం గ్రామంలో రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందించినట్లు తెలిపారు. జనుము, పిల్లిపెసర, జీలుగ సాగు చేపట్టి.. పూత దశలో కలియదున్నడం వల్ల భూమిలో సారం పెరుగుతుందన్నారు. దీంతో రసాయన ఎరువుల మోతాదును తగిగచుకోవచ్చని వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

వరుణుడిపైనే భారం.. నారుమళ్లు సిద్ధం



భట్టిప్రోలులో వెద పద్ధతిలో సాగు



భట్టిప్రోలు-వెల్లటూరు రహదారి పక్కన పొలంలో సిద్ధం చేసిన నారుమడి

భట్టిప్రోలు: ఖరీఫ్‌కు సాగుకు రైతాంగం సమాయత్తమైంది. ఆటుపోట్లు అన్నింటిని ఎదుర్కోగలమనే ధైర్యంతో ఉన్నా రైతులు మాత్రం కొందరు ఇప్పటికే సాగుకు సిద్ధమయ్యారు. కాల్వల నీటిపై ఆధారపడకుండా భూగర్భ జలాలను ఆసరాగా చేసుకుని నారుమళ్లు వేసుకున్నారు. మండలంలో ఈ ఏడాది సుమారు 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టనున్నారు. వర్షాలు సక్రమంగా కురిసి కాల్వల ద్వారా నీరందితే గాని ఖరీఫ్‌లో నాట్లు పూర్తికాగలవని రైతులు అంటున్నారు. ఈ నెలలో 145.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 12.4 మి.మీ.లు, గత నెలలో 95.0 మి.మీటల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 68.8 మి.మీల వర్షపాతం నమోదైందని సహాయ గణాంకాధికారి కొండలరావు తెలిపారు.

రైతులకు వ్యవసాయశాఖాధికారుల సూచనలు

నారుమడికి తప్పనిసరిగా పశువుల ఎరువు వేయించి, రెండున్నర సెంట్లకు అరకిలో పొటాష్ వాడాలని వ్యవసాయశాఖాధికారి జి. మీరయ్య సూచించారు. రెండుమూడు ఆకులతో ఉండే వరకు ఆరుతడి పెట్టాలని వివరించారు. నారుమడిలో పురుగు నివారణకు మొలకెత్తిన 7వ రోజును 10 సెంట్ల నారుమడికి 1800 గ్రాములు కార్బొఫ్యూరాన్ గుళికలు వాడాలని చెప్పారు. వరిలో విధిగా విత్తన శుద్ధి చేయాలని తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కిలో విత్తనాలకు 3 గ్రాముల కార్బండైజమ్ కలిపినట్లెతై వరిలో వచ్చేటటువంటి అగ్గి తెగులు, పాము పొడ, వివిధ శిలీంద్రాల నుంచి వచ్చేటటువంటి తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

పట్నంబజారు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం చంద్రమౌళి నగర్‌లోని భాష్యం కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్క నిబంధన పాటిస్తూ, అన్ని ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.